# రూలు ప్రకారం

సూర్యారావు నరసరావు పేట నుంచి బెజవాడ చేరుకున్నాడు. చీకట్నేలేచి, అయిదు గంటలకల్లా బయలుదేరపోయి, ఎనిమిదయ్యేసరికి రెండు వాయిదాల మీద గుంటూరు చేరుకున్నాడు. (విజయవాడని బెజవాడ అనడమే అతనికెంతో ఇష్టం. అదే ఆ పట్టణపు అసలు పేరు.) గుంటూరులోనే తన ప్రయాణం ఆగిపోతుందనుకున్నాడు. కాని అదృష్టవశాత్తూ ఆగలేదు. బెజవాడవచ్చేశాడు గనుక ఇక ఫరవాలేదు. బోలెడు రైళ్లు. ఇక ప్రయాణానికి తిరుగులేదు అనుకున్నాడు కాని బంద్ కార్యక్రమం ఇంత తీవ్రరూపం ధరిస్తుందనీ, రైళ్లు కూడా ఆగిపోతాయనీ అనుకోలేదు.

కొద్ది రోజుల క్రితం రాజధానిలో రాజకీయ నాయకుల మధ్య చెలరేగిన పగ రాజీనామాల దాకా వెళ్లి ఘోరం జరిగిపోయింది. పార్టీ బలా బలాలను తేల్చుకోవడానికి ఇరు పక్షాల నాయకులూ దానికి ప్రజా ఉద్యమంగా మార్చేశారు. కోతిగపుండు బ్రహ్మరాక్షసయి కూచుంది.

సూర్యారావు పది రోజుల క్రితం తండ్రికి జబ్బు చెయ్యగా నరసరావుపేట వచ్చాడు. ఇప్పుడాయనకు వంట్లో నిమ్మళంగా ఉంది. ఇవ్వాళ తప్పనిసరిగా డ్యూటీకి వెళ్లాలి. లేకపోతే కొంప మునిగిపోతుంది. ప్రిన్సిపల్ మంచివాడే అయినా సూపర్నెంటు మంచివాడు కాదు. లేక ఇద్దరూ తోడుదొంగలో.

ఉదయానికి అంత ఉధృతంగాలేని ఉద్యమం వేడి, ఎనిమిది దాటేసరికి బాగా అందుకుంది. గత రాత్రి ఒక వర్గంవారు కొన్ని చోట్ల రైల్వేలైను ఫిష్ ప్లేట్లు తొలగించారట. ముఖ్యంగా హైదరాబాద్ చుట్టుపక్కల. అనంతపురం నుంచి కర్నూలు వస్తున్న గూడ్సుబండి పట్టాలు తప్పిందట. తెల్లవారేసరికి రేడియోలన్నీ గగ్గోలు పెట్టేశాయి. రాష్ట్రంలో ఎక్కడి రైళ్లు, బస్సులు అక్కడే ఆగిపోయాయి. పేపర్లనిండా ఈ వార్తలే. తన గొడవలో తనుండి గత మూడు రోజులుగా జరుగుతున్న రాజకీయ సంక్షోభం గమనించలేదు. అది అగ్ని పర్వతంలా ఈ నాడు పగిలింది. తన కొంప మునిగింది.

సూర్యారావు విశాఖజిల్లాలోని ఒక చిన్న పట్టణంలో కొత్తగా రెండేళ్ల క్రితం పెట్టిన గవర్నమెంటు (డిగ్రీ) కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. కృష్ణా, గోదావరీ అనే రెండు మహానదులు దాటి దాదాపు 350 కిలోమీటర్లు ప్రయాణం చేస్తేగాని తన వూరు నుంచి ఉద్యోగం చేసే ఆ వూరు చేరుకోలేడు.

ఇవ్వాళ తను కదిలే ప్రసక్తి లేదని తేలిపోయింది. తిరిగి ఇంటికి వెళ్లలేడు కూడాను. మరి రోజంతా బెజవాడలో ఏం చేస్తాడూ? సూర్యారావుకి విపరీతంగా కోపం వచ్చేసింది. సూర్యారావుకి కోపం రావడంవల్ల సూర్యారావుకే నష్టం కాని మరెవ్వరికీ నష్టం లేదు.

రైల్వే ప్లాటుఫారంమీద దుకాణాలు కూడా మూసేస్తారు గావును. గబ గబా 'కాఫీ ఫలహారశాల' కు వెళ్లి (అందులో ఫలాలు ఏమీ వుండవు కదా, మరి రూలుప్రకారం) నాలుగు ఇడ్లీలు తిని, నాలుగు చెంచాలు కాఫీ తాగి మూడు రూపాయలు చెల్లించి వచ్చాడు. ఏమి జనం, ఏమి జనం. ఏమయిపోతారు వీళ్లంతా. పిల్లలు, పెద్దలు, ముసలివాళ్లు, ఆడవాళ్లు.

గుంపుగా చేరి గొడవ చేస్తూ ఆలోచనలు సాగిస్తున్న వారి దగ్గరికి వెళ్లాడు.

"అసలు రూలు ప్రకారం మొత్తం మంత్రివర్గం రాజీనామా చేసెయ్యాలి" అన్నాడొక పొరుగు చంపల పొట్టి యువకుడు.

"నన్నడిగితే ఆ గవర్నర్ని డిస్మిస్ చేసెయ్యాలి" అన్నాడొక టకప్ చేసుకున్న 'ముసలి యువకుడు.'

"పార్టీలు పెరాయించే వెధవల్ని పాతెయ్యాలి" అన్నాడొక ముసలాయన ధర్మ కోపం ప్రదర్శిస్తూ. ఆవేశంవల్ల నీరసం వచ్చి ఆగాడు.

"చూడండి మీకసలు రాజ్యాంగం తెలీదు. నన్నడగండి నేను చెబుతాను. రూలు ప్రకారం ఏం చెయ్యాలంటే" అని ప్రారంభించాడు ఒక పంచకట్టు ఆసామీ. జనం ఈగల్లా అతని చుట్టూ మూగారు.

సూర్యారావుకి చాలా అసహసంగా ఉంది. అసహ్యంగా కూడా ఉంది. ఆకలిగా మాత్రం లేదు.

టైము పది దాటింది.

నిలబడి నిలబడి విసిగిపోయి, ఖాళీ రాగా, ఒక సిమెంటు బెంచీమీద కూచుని ఒక నడివయసు ఆడమనిషిని పరిశీలనగా పరిశీలిస్తున్నాడు. కొంచెం రిలీఫ్. ఈ మధ్య అందరూ బొడ్డు కిందకు చీర కడుతున్నారు. నడుం స్లిమ్‌గా నైస్‌గా ఉంటేనే దాని అందం.

అసలు రూలు ప్రకారం.....

ఏమిటయ్యా రూలు గీలూనూ.

ఇందాకటి సంభాషణ సంఘర్షణలోకి దిగినట్టుంది. ఆ కేకలకి తన్నుకుంటారేమో ననుకున్నాడు. పోలీసులు వచ్చారు, బెదురు, బెదురుగా

"రూలు ప్రకారం మిమ్మల్నందర్నీ అరెస్టు చెయ్యవలసి ఉంటుంది తెలుసా" అన్నాడు. ఆ పోలీసుల్లో ఒకడు, ఏమయితే అదయిందని ధైర్యంచేసి. ఆ జనాన్ని చూస్తూంటే వాళ్లకు కళ్లు చెదిరిపోయేయి. గుండెలు బెదిరిపోయాయి. ప్రాణాలు అదిరిపోయాయి. ఏమి జనం, ఏమి జనం.

సూర్యారావు స్టేషన్‌లోంచి ఇవతలికి వచ్చాడు. చేతిలో సూటుకేసు చాలా బరువుగా ఉంది. రోడ్లమీద జనం గుంపులు గుంపులుగా చేరి మాట్లాడుకుంటున్నారు. రిక్షాలూ, ఆటోలూ ఎక్కడివక్కడే ఆగిపోయినట్టున్నాయి. వచ్చిన గుర్రపు పంజరాల్లా అక్కడక్కడా సైకిళ్లు నిలబెట్టి ఉన్నాయి.

వంతెన దాటి, అలా రోడ్డు మీద నడుస్తున్నాడు. చాలా హడావిడిగాఉండవలసిన పెద్ద పెద్ద పుస్తకాల కంపెనీలు ఇనుప ముసుగులు వేసుకున్నాయి. షాపుల తలుపులకు తాళం కప్పలు జీవంలేని గుండెకాయల్లా వేళ్లాడుతున్నాయి. జనం పిచ్చి కుక్కల్లా మొరుగుతున్నట్టు కనిపించారు.

రూలేమిటి రూలు, రూలూ లేదు రైమూ లేదు, మైటీజ రైట్, రైటీజు మైట్, టైటీజ రైట్, రైటీజ్ మైట్, ఛ ఛ.

రూలు ప్రకారం తను ఏనాడో లెక్చరరు కావలసింది. తనకు పెర్సంటేజీ వుంది. ప్రమోషన్ చానల్ క్లియర్‌గా వుంది. కాని ఎనిమిదేళ్లు ఆలస్యంగా ఈ మధ్యనే లెక్చరర్ అయ్యాడు. గవర్నమెంటులో కొన్నాళ్లు హైస్కూల్ టీచర్‌గా చేసిన తనకి నేరుగా అసిస్టెంట్ లెక్చరర్ ప్రమోషన్ రావల్సింది. కనీసం 77 లో రావల్సింది. 78 నాటికైనా కొత్త జీ.వో. ప్రకారం తన లెక్చరర్ అయిపోను. ఎన్ని అప్లికేషన్లు పెట్టినా, ఎన్ని రిమైండర్లు పంపినా ఎవరూ చూడందే. చివరికి మూడు నాలుగుసార్లు ఆదరా బాదరా అదరాబాద్ అదే హైదరాబాద్ తిరగ్గా తిరగ్గా చివరికి జూనియర్ లెక్చరర్ అయ్యాడు. అదొక త్రిశంకు స్వర్గంలాంటి ఉద్యోగం. హైస్కూలూ కాదూ, కాలేజీ కాదు. ఇంటర్మీడియెట్ ఇడియెట్‌లా నోరు మూసుకుని కూచున్నాడు. అలా ఏడేళ్లకు పైగా పాట్లు పడి పడి పడి చివరికి ఈ మధ్య లెక్చరరయ్యాడు! 74 లో జరగవలసిన పని 84 లో జరిగింది! నీ వెక్క దలుచుకున్న రైలు ఎప్పుడూ ఒక జీవితకాలం లేటు అంటే ఇదే గావును! తను జిల్లా పరిషత్‌లోనో, మునిసిపాలిటీలోనో, ప్రయివేటు సంస్థలోనో పనిచేస్తున్నవాడు కానే కాదు. ఫక్తు స్టేటు గవర్నమెంటు ఉద్యోగి. మరి తనకి అన్యాయం జరగలేదూ? పూర్వం అనేక మంది క్వాలిఫైడ్ పీపుల్ ట్యూటర్లుగా, డిమాన్‌స్ట్రేటర్లుగా మగ్గేవారట. ఇప్పుడు తన మగ్గేడు కోర్టులో రిట్టు వెయ్యమని రెడ్డి శాస్త్రి తనని ఎన్ని సార్లు తిట్టలేదు? శ్రీకృష్ణులవారు అర్జునుడికి చేసినట్టు, కోర్టు కృష్ణులు కొందరు తనకు ఉచితంగా కోర్టోపదేశం చెయ్యగా నోరు మూసుకు కూచున్నాడు కాలేజీలు నయమేనట, యూనివర్శిటీలు మరీ చండాలంగా ఉన్నాయట.

రూలు ప్రకారం అనే మాట సూర్యారావుకు కోపం తెప్పిస్తుంది. రూల్సు, తమ తమ స్వప్రయోజనాలు సాధించుకోవడానికి అడ్డం పెట్టుకునే సాకులు అని అతని గట్టి నమ్మకం.

పదకొండు దాటింది. అసహ్యంగా వుంది. ఆకలిగా ఉంది. ఎక్కడా ఏ హొటలూ తెరిచిలేదు. ఎక్కడా ఎవరి నోరూ మూసి లేదు. ఇదేం ప్రజా ఉద్యమం?

సోచో కభీ ఐసా హోతో క్యాహో

హం తుం ఎక్ బస్తీమె బంద్ హో.

సూటుకేసు బరువుగా ఉంది. బరువు సూట్‌కేసులా వుంది.

సామాన్య ప్రజలు ధరలు పెరిగాయనిగాని, సన్నకారు రైతులు, కూలీలు తమ పరిస్తితులు బాగా లేదనిగాని, విద్యార్థులు, ఉద్యోగులు తమ కోర్కెల పరిష్కారంకోసం గాని రాజకీయ విభేదాలు చెయ్యని ఉద్యమాలు కోసం, పదవుల కోసం, మెజారిటీల కోసం జనాల్ని రెచ్చగొట్టి ఈ ఉద్యమాలేమిటి? రాజ్యాంగ సూత్రాలతో ఏనాడైనా ప్రజలకు నేరుగా సంబంధం వుంది గనుకనా? రాజ్యాంగం రాజ్యం–అంగం.....

సత్యనారాయణపురంలో సూర్యారావు స్నేహితుడున్నాడు. చుట్టుబండ దగ్గిర చుట్టాలున్నారు. ఎవరింటికైనా వెళితే తప్ప భోజనంలేదు. విశ్రాంతి లేదు శాంతియె లేక సౌఖ్యము లేదు, ఇలా ఎంతసేపు రోడ్ల మీద తిరుగుతాడు. తిరిగి తిరిగి ఒక మారుమూల సందులో కనపడిన రిక్షా మాట్లాడుకుని సత్యనారాయణపురంలో స్నేహితుడి ఇల్లు వెతుక్కుని వెళ్లాడు. తీరా వెళితే ఆ ఇంటికి తాళం వేసి ఉంది. ఆ పక్క ఇల్లు కూడా తాళం వేసి ఉంది. కొంప ముంచి ఇళ్లల్లో ఉన్న జనం కూడా బందు చెయ్యడం లేదు కదా. ఒక కిటికీని అడిగాడు. ఈ మధ్యనే ఆ ఇంట్లో ఉన్న వాళ్లు లబ్బీపేటలో మరో ఇంటికి మారిపోయారట. ఉసూరుమని రిక్షా చుట్టుబండవేపు తిప్పించాడు. విశాలాంధ్ర ఆఫీసు సమీపంలో ఒక చుట్టాలింటికి వెళ్లాడు.

బట్టలు మాసిపోయినట్టయిపోయాయి. చిరాకు చిరాకుగా వుంది. మూడు గంటలకు భోజనం చేశాడు. కాస్సేపు మంచంమీద దొర్లి నాలుగుగంటలకు రోడ్డుమీదికి వచ్చాడు. మెల్లిగా నడుస్తున్నాడు.

హైదరాబాద్‌లో కొందరు రచయితల్ని అరెస్టుచేసి, మాకు వద్దని చెప్పినా బలవంతంగా ఫోటోలు తీశారు. అలా తియ్యకూడదని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి లోగడ తీర్పుఇచ్చినా, మళ్లీ అలాగే ఫోటోలు తీశారట! ఇది కోర్టు ధిక్కారనేరం కాదూ? ఈ వార్తలు ఏ పేపర్లూ ప్రకటించలేదట. సత్యం ఒక పత్రికలోంచి చదివి వినిపించే దాకా తనకీ తెలీదు.

కోర్టు రూలింగే రూలు కానప్పుడు మరి రూల్సు దేనికి?

తనింకా బెజవాడలోనే ఉన్నాడేమిటి? వెళ్లిపోవాలి. ఎలాగయినా డ్యూటీకివెళ్లి పోవాలి. లేకపోతే తనను చాలా ఇబ్బంది పెట్టేస్తారు. ఎర్న్‌డ్ లీవు లెక్కఁణ్ణించి వస్తాయి? మెడికల్ లీవు పెట్టమంటారు. అది శాంక్షను అయ్యేదాకా జీతం ఆపేస్తారు. జీతం ఆగిపోతే ఎలా, ఇప్పటికే బోలెడు సొమ్ము ఖర్చయిపోయింది.

ప్రభుత్వోద్యోగి ఒకేసారి పది రోజులు దాటకుండా సెలవు పెట్టుకోవచ్చు. పదకొండవ రోజున డ్యూటీకి రావచ్చు. కొందరు ప్రబుద్ధులు తొమ్మిది రోజులు సెలవు పెట్టాలని పదో రోజున రావాలని వ్యాఖ్యానాలు చెయ్యడం తనకు తెలుసును. అలాగే బస్సులలో పన్నెండేళ్లు దాటితే నిండు టిక్కెట్టు తీసుకోవడానికి బదులు, పదకొండు నిండి పన్నెండు వచ్చేయంటేనే నిండు టిక్కట్లు తీసుకుంటున్నారు.

అసలు తను గుంటూరు జిల్లాలో పుట్టిపెరిగాడు. విశాఖపట్నం ఆంధ్రాయూనివర్శిటీలో ఎం.ఏ చదివాడు. విజయనగరంలో బీయీడి కూడాఅయ్యాడు. (ఈమధ్యకరస్పాండెన్స్ కోర్సులో ఎం.ఈడీ కూడావెలగబెట్టాడు) మొట్టమొదట విశాఖ జిల్లాలో ఉద్యోగం వచ్చింది, ఆతరువాత జోనల్ విధానం

వచ్చింది.గుంటూరులో పుట్టినా విశాఖ జిల్లాలో చదువూ ఉద్యోగమూ గనుక ఇక తను చచ్చినా గుంటూరుజిల్లా వెళ్లలేడు. నిజంగా రూలుప్రకారం తను గుంటూరుజిల్లావాడేకదా.

రకరకాల ఆలోచన్లతోబుర్రంతా పిచ్చిపిచ్చిగా ఉంది. ఆరాత్రిసరిగ్గా నిద్రపట్టలేదు.

తెల్లవారుజామునే లేచి,నిద్ర మొహాన్ని స్టేషన్‌కు వచ్చి ఎలాగో ఒక పాసింజరు రైలు ఎక్కగలిగాడు. ఎక్స్‌ప్రెస్‌లు రద్దు. సాయంత్రం నాలుగుగంటలకి విశాఖపట్నం చేరుకొని, అక్కణ్నించి ఒక ప్రయివేటు బస్సులో పడిగాపులు పడి పడి నిలబడి నిలబడి దీపాలు పెట్టేక ఉద్యోగం చేస్తున్న వూరు చేరుకున్నాడు. నరసరావు పేట నుంచి నడిచి వచ్చినా ఇంత శ్రమ ఉండకపోనేమో నన్నంత విసుగూ, అలసటా కలిగింది. ఒళ్లంతా హూనం అయిపోయింది.

అయినా కానీ సకాలంలో చేరుకోలేకపోయాడు కదా. ఇప్పుడేం దారీ.

మర్నాడుదయం ఎనిమిది గంటలకే ప్రిన్సిపలుగారింటికి వెళ్లాడు. సూపర్నెంటు కూడా బొట్టూ, చెవిలో పువ్వూ, మెళ్లో రుద్రాక్ష మాలతో సహా అక్కడే ఉన్నాడు. ఆ గదినిండా అమ్మల, బాబాల ఫోటోలే. షిర్డీ సాయిబాబా, సత్యసాయి బాబా, నీలకంఠ బాబా, మెహర్ బాబా, ముమ్మిడివరం బాలయోగి, రజనీష్, జిల్లెళ్లమూడి అమ్మ.

సూర్యారావుకు నవ్వు వచ్చింది. ఇంకా తరవాయెందుకూ మంగమ్మవ్వ ఫోటో కూడా ఆ పక్కన తగిలించకూడదూ.

నవ్వు అణుచుకుని, మొహంలోకి బాధనీ విచారాన్నీ తెచ్చుకుని సూర్యారావు తన సంగతంతా వివరంగా చెప్పాడు.

ప్రిఫిక్సూ, సఫిక్సూ సౌకర్యం ఉంది గనుక పది రోజులకాజువల్ లీవు అనంతరం, అదనపు రోజులకు మెడికల్ లీవు గాని, ఎర్నెడ్ లీవుగాని పెట్టడం అవసరం అన్నాడు సూపర్నెంటు. మళ్లీ ఎర్నెడ్ లీవు పనికి రాదు మెడికల్ లీవు పెట్టడం మంచిదన్నాడు. ప్రిన్సిపల్ తనకు చాలా ఇష్టుడైన ఒకానొక ఆచార్యులవారిచేత మర్నాడు వచ్చినా సంతకం పెట్టించిన సంగతి సూర్యారావుకు తెలుసును, కాని ఆ మాట పైకి ఎలా అంటాడూ? తన విషయంలో ఘోరం జరిగిపోతోంది. వల్ల మాలిన కోపం వచ్చేసింది దిగమింగుకున్నాడు. తను డ్యూటీకి రావడం లేటయిన మాట నిజమే కదా.

లెక్చరరంటే గెజిటెడ్ ఆఫీసరు. గనుక మామూలు డాక్టర్లు ఇచ్చిన మెడికల్ సర్టిఫికేట్ పనికిరాదు. గవర్నమెంటు డాక్టరు, అందులోనూ సివిల్ సర్జనుగాని, సివిల్ అసిస్టెంటు సర్జనుగాని ఇవ్వాలి. ఈ వూరు ఒక సామాన్యమైన తాలూకా కేంద్రం. ఆ వూళ్లో ఆస్పత్రి సంగతి చెప్పాలంటే అది వేరే కథ. సర్జన్లు, అసిస్టెంటు సర్జన్లూ ఎక్కణ్నించి వస్తారు?

మరయితే ఇప్పుడు తను వైజాగ్ పరుగెత్తి, కేజీ హెచ్‌కి వెళ్లి ఎవరి కాళ్లో పట్టుకుని సంపాదించాలి. వాళ్లొకంతట సర్టిఫికెట్ ఇస్తారా? ఏం చేస్తాడు, పాపం పూర్ సూర్యారావు ఆ రోజు పనిచేసి మర్నాడు సెలవు పెట్టి విశాఖపట్నం పరుగుతీశాడు.

బస్సులో ఒక డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ గారు కలిశారు. పాత పరిచయస్తుడే. ఎం. ఏ. బీయీడీ. ఇంకా ఆ ఉద్యోగమే చేస్తున్నాడు. ఆయన కంటే జూనియర్లయినా జిల్లా పరిషత్ టీచర్లు కొందరు లెక్చరర్లూ, ప్రిన్సిపల్సు కూడా అయిపోయేరు. ఏవో రూల్సు అడ్డం వచ్చేయట ఆయన విషయంలో. పూర్వం ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఉద్యోగాలుండేవి. కనుక డిప్యూటీ ఇన్ స్పెక్టర్ అనేవారు. ఇప్పుడెందుకనాలి అలాగ. కేవలం ఇన్‌స్పెక్టర్ అంటే పోలేదూ? పోనీ మనకెందుకు.

బస్సు యమ రద్దీగా ఉంది. ప్రయివేటు బస్సు. ఆలస్యం కాదు గాని ఒక బస్సులో నాలుగు బస్సులజనం ఎక్కించేస్తాడు. అలా ఉంటేనే సర్వీసు బాగా ఉన్నట్టు.

వైజాగ్‌లో రైల్వే కాలనీ దగ్గిర వో సిటీ బస్సు పట్టుకుని కింగ్ జార్జి ప్రభువుల వారి ఆస్పత్రికి వెళ్లాడు. తనసంగతి చెప్పుకున్నాడు. ఇన్‌పేషంటుగా జాయిన్ కావాలన్నారు. కనీసం అవుట్ పేషంటు చీటీ అయినా ఉండాలట. రూలు ప్రకారం అయితే పాత తారీకుతో సర్టిఫికెటు ఇవ్వడం కుదర్దన్నారు. ఉద్యోగాలు పోతాయట దొరికిపోతేను. అయినా ఒక్క రోజుకు మెడికల్ సర్టిఫికెటు ఎలా ఇస్తాం. మొత్తం పదకొండు రోజులకీ తీసుకోకూడదా అని సలహా ఇచ్చారు. తిరిగి తిరిగి ఆ మాటలు విని విని తనక్కడ నిజంగానే పేషంటయిపోతానేమోనని భయం పట్టుకుంది సూర్యారావుకు. సన్నటి సరళ అనే నర్సు సూర్యారావుకు కొంచెం సహాయంగా మాట్లాడింది. నారాయణరావు అనే డాక్టరు కొంచెం సాయం చేశాడు. అయినా రెండు రోజులు పట్టింది. చివరికి నానా తంటాలూ పడి, కొద్దిపాటి సొమ్ము కూడా ఖర్చు చేసిన తరువాత (డాక్టర్లు బొత్తిగా అంత లంచగొండి వాళ్లు కారేమో), ఎమిబిక్ హెపటైటిస్ అని (కాలేయ సంబంధమైన) వ్యాధి ఉన్నట్టు, 11 రోజులు విశ్రాంతి అవసరం అయినట్టు (బెడ్ రెస్ట్!), 12 వ రోజున సంపూర్ణారోగ్యంతో వుండి "విధులకు హాజరగుటకు తగిన శక్తి సామర్థ్యములు కలిగి ఉన్నట్టు" ఒక సర్టిఫికెట్టు సంపాదించాడు.

ఆ వ్యాధి గురించి వినేసరికి నీరసం పుట్టేసింది. అలాంటి వ్యాధి ఉన్నట్టు కూడా లోగడ ఎన్నడూ వినలేదు. ఆ జబ్బేదో నిజంగానే తనకు వచ్చినంత బాధ పడుతూ కొంప చేరుకున్నాడు.

మర్నాడు కాలేజికి వెళ్లాడు. సూపర్నెంటూ మరో గుమాస్తా వెస్ట్ బెంగాల్ గొడవల గురించి మాట్లాడుకుంటున్నారు. రెండు బెంగాలులు ఉంటే కదా ఒకటి ఈస్టూ, మరొకటి వెస్టూను. ఉన్నదొకటే అయితే వెస్ట్ బెంగాలనడందేనికో. ఈ చిన్న ఆలోచన ఎవరికీ రాలేదా రూలు ప్రకారం?

సూపర్నెంటు అదొక రకంగా నవ్వుతూ "రండి సార్ రండి సార్" అన్నాడు.

"మీరు నరసరావుపేట వెళ్లడానికి పది రోజులు సెలవు పెట్టారు. అదే ఎనిమిది రోజులు సెలవు. రెండు ఆదివారాలు. ప్రిన్సిపలుగారు గ్రాంటు చేశారు. కాజువల్ లీవు రిజిస్టర్‌తో ఈ సంగతులన్నీ రికార్డు చేశాం. ఇప్పుడు మొత్తం రోజులకు విశాఖపట్నంలో ఉండి జబ్బుపడినట్టు సర్టిఫికెట్ తెస్తే ఎలాగ?' అని ధర్మసందేహం వెలిబుచ్చారు నవ్వుతూ.

అయినా జబ్బు రానివాడిచేత జబ్బు వచ్చినట్టు మెడికల్ సర్టిఫికెట్ పెట్టించడం ఏమిటీ? పైగా ఆ వూళ్లో సివిల్ సర్జనే లేకపోతే, సివిల్ సర్జనే సర్టిఫికెట్ ఇవ్వలనడం ఏం న్యాయం? ఏం రూల్సివి? లోగడ. శ్రీకాకుళంలో పని చేస్తున్నప్పుడు అనంతపురం నుంచి ఒక పెద్దమనిషి మంత్రిగార్ని పట్టుకుని జోనలు ట్రాన్స్‌ఫరుమీద తన స్థానంలో వచ్చి కూచున్నాడు. ఆయన నెల్లాళ్లు మెడికల్ లీవు పెట్టి హైదరాబాద్‌లో కూచుని పని చేయించుకున్నాడట. అనంతపురంలో ఉద్యోగం చేసేవాడు మెడికల్ లీవు పెట్టి హైదరాబాద్‌లో డైరెక్టరుగారి ఎదురుగా ఎలా కూచుంటాడు రూలు ప్రకారం? అది రైటేనట! నెలల తరబడి స్వంత పనులు చేయించుకోవడానికి మెడికల్ లీవా?

టీయే బిల్లు రూల్సు మరీ దారుణం! అస్సలు ప్రయాణమే చెయ్యనివాడు వోచర్లు పెట్టి డబ్బు డ్రా చేసేస్తాడు. రూలు ప్రకారం! నిజంగా ప్రయాణం చేస్తే బిల్లు మారదు! మారినా బోలెడన్ని కటింగులు, పక్కపక్కనే ఉన్న వూళ్ల మధ్య ప్రయాణం. రైలు ద్వారా చుట్టు తిరిగి సాగుతుంది. ఇది అతి దగ్గిర ప్రయాణం అని సర్టిఫికేట్, ఏమి రూల్సు, ఏమి బూరాక్రసి, ఏమి రెడ్ టేపిజం!

సూర్యారావుకు జీతం రానేలేదు. మరుసటి నెల సప్లిమెంటల్ బిల్లు పెడితే డ్యూటీ పిరియడ్‌కు జీతం వచ్చింది. మూడు నెలల తరువాత మెడికల్ లీవు శాంక్షను అయ్యాక (కొంత ముడుపులు చెల్లించాక) పదకొండు రోజుల జీతం వచ్చింది! రూలు ప్రకారం అంతేనట.

*రచనా కాలం : ఆగస్టు 1984*

*ప్రచురణ : ఆంధ్రప్రభ (ఆదివార అనుబంధం) 16-9-1984.*